దాతృత్వంతో సన్మార్గం..



భక్తి శ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల వద్ద ప్రార్థనలు

దాతృత్వం సన్మార్గానికి బాటలు వేస్తుందని, త్యాగానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని ముస్లిం మతపెద్దలు వివరించారు. సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో బక్రీద్‌ను సోమవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లింలు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బక్రీద్ విశిష్టతను ముస్లిం మతపెద్దలు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్


సత్తుపల్లిటౌన్: ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వైరా: ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


వైరారూరల్: ఖానాపురం ఈద్గాలో..


సత్తుపల్లిరూరల్: తుంబూరులో..


చింతకానిలో..


బోనకల్: ముష్టికుంట్లలో..


ఎర్రుపాలెంలో..


కల్లూరురూరల్: ముస్లిం మహిళలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి


ముదిగొండలో..


మధిరరూరల్: మాట్లాడుతున్న మత పెద్ద


కొణిజర్లలో..


కారేపల్లిలో..


ఏన్కూరు: తిమ్మారావుపేటలో..


కల్లూరు: ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


తల్లాడలో..

క్లుప్తంగా

అగ్రి ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత


నగదు, దుస్తులు అందజేస్తున్న దాతలు

ఏన్కూరు: మండల పరిధిలోని తూతకలింగన్నపేటలో ఇటీవల అగ్నిప్రమాదంలో ఇళ్లు కోల్పోయిన మాజీ సర్పంచ్ రేసు వెంకయ్య కుటుంబానికి దాతలు సోమవారం చేయూత అందించారు. ఆదివాసీ ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో రూ.22,500, భద్రాద్రికొత్తగూడెం వర్తక సంఘం సభ్యులు భానుప్రసాద్ దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాడియం బాలరాజు, ముక్తి భాస్కరరావు, కుర్సం సీతారాములు, వర్స లక్ష్మణ్, జోగా రాంబాబు, బండ వెంకటేశ్వర్లు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తల్లాడ: స్థానిక రైతువేదికలో మంగళవారం మండలంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే మట్టా రాగమయి కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాపా సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

శివాలయంలో అన్నదానం


భోజనం వడ్డిస్తున్న దాతలు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని వెంగళరావునగర్‌లో శ్రీ భ్రమరాంబిక సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన గుంజి వెంకటేశ్వర్లు, మంగమ్మ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రామడుగు గురుబ్రహ్మాచార్యులు, శొంటి నానాజీ, ఎం.నర్సింహాచారి, కె.బాబురావు, బి.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు


ప్రార్థనలకు హాజరైన విద్యార్థులు

వైరా: స్థానిక శాంతినగర్‌లోని హోలీ ట్రినిటీ చర్చిలో సోమవారం విద్యార్థుల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుండగా చర్చి ఫాదర్ జ్ఞాన్నేసు ఆధ్వర్యంలో ప్రత్యేక దివ్య బలి పూజ సమర్పించారు. ప్రతీ విద్యార్థి నూతన విద్యా సంవత్సరంలో మంచి విద్యా బుద్ధులు నేర్చుకుని మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేరీ ఇమ్మాక్యులేట్ కరస్పాండెంట్ మీనా, హెచ్‌ఎం యమున, సిస్టర్‌లు సుశీల, బెన్నెట్, సుమ, స్మిత, సంఘ పెద్దలు దాసు, జోజి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక పక్షపాతి 'పేరసాని'

కొణిజర్ల: సీఐటీయూ నాయకుడిగా, ఆర్టీసీ కండక్టర్‌గా విధులు నిర్వహిస్తూ కార్మిక పక్షపాతిగా నిలిచిన పేరసాని రామారావు సేవలు అజరామరమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు అన్నారు. ఇటీవల మృతి చెందిన పేరసాని రామారావు సంస్మరణ సభ సోమవారం తనికెళ్లలో అన్నారపు వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల కృష్ణయ్య, వై విక్రమ్, తాళ్లపల్లి కృష్ణ, కుటుంబరావు, వెంకటేశ్వరరావు, సాంబ, రంజాన్ తదితరులు పాల్గొన్నారు

పేకాటరాయుళ్ల అరెస్ట్

పెనుబల్లి: మండలంలోని పాతకారాయిగూడెంలో నల్లబోతుల పెద్దబాబు మామిడి తోటలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.11 వేల నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.వెంకటేష్ తెలిపారు.

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి


సత్తుపల్లిటౌన్: ప్రజావాణి నిర్వహిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చింతకాని: నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు కృషి చేస్తున్నట్లు విద్యుత్ సంస్థ ఎస్ఈ సురేందర్ తెలిపారు. విద్యుత్ ఉప కేంద్రాల్లో విద్యుత్ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ మేరకు నాగులవంచ విద్యుత్ ఉపకేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హాజరై దరఖాస్తులను పరిశీలించి సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను అందించేందుకు కృషి చేయాలని ఏఈలకు సూచించారు. పెద్దగోపతి ఏడీఈ తిలక్, ఏఈ ఉమామహేశ్వరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారం..

సత్తుపల్లిటౌన్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే తక్షణం స్పందిచనున్నట్లు విద్యుత్‌శాఖ సత్తుపల్లి డీఈఈ ఎల్.రాములు అన్నారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించేందుకే ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని 11 సెక్షన్ కార్యాయాలు, 3 సబ్ డివిజన్ కార్యాలయాలు, రెండు రెవెన్యూ కార్యాలయాలలో విద్యుత్ ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడు ఫిర్యాదులు స్వీకరించగా వాటిల్లో తక్షణమే ఐదింటిని పరిష్కరించామని, మిగిలిన ఫిర్యాదులను సంస్థ నిర్దేశించిన గడువులో పరిష్కరిస్తామన్నారు. ఏన్కూరు సబ్ స్టేషన్‌కు గతంలో 33 కేవీ లైన్ ఒక్కటే ఉండగా వినియోగదారులకు అంతరాయం లేని నిరంతర విద్యుత్ అందించడంలో భాగంగా ప్రత్యామ్నాయ లైన్‌గా జూలూరుపాడు లైన్‌ను అందుబాటులో తీసుకొచ్చామన్నారు. ఈ ప్రత్యామ్నాయ లైన్ వేసేందుకు సహకరించిన రైతులకు సంస్థ తరఫున ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా రానున్న రోజుల్లో సత్తుపల్లి డివిజన్‌లోని అన్ని 33/11 కేవీ సబ్‌స్టేషన్లకు ప్రత్యామ్నాయ అనుసంధాన లైన్లను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలను ఉన్నతాధికారులు సమర్పించామన్నారు.


ముదిగొండ: ముదిగొండ సబ్‌స్టేషన్‌లో..

ముదిగొండ: విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రతీ సోమవారం గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏడీఈ భీంసింగ్ అన్నారు. మండలంలోని పమ్మి, ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్లలో రైతులు, వినియోగదారుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. మండల పరిధిలోని దనియాగూడెంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కావాలని రైతులు ఏడీఈకి వినతి పత్రం అందజేశారు. ఏఈలు మేకపోతుల శ్రీనివాస్, నారాయణలు పాల్గొన్నారు.

ఇరువురిపై కేసు నమోదు

చింతకాని: దాడి ఘటనలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఇరువురిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని నేరడ గ్రామానికి చెందిన గోరిబండ్ల జమలమ్మ, సంపసాల గోపిలకు ఇంటి సరిహద్దు విషయంలో ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో జమలమ్మపై గోపి, రేణుకలు దాడి చేశారు. జమలమ్మ చేసిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగుల్‌మీరా ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఐక్యతను నిరూపిద్దాం..


సత్తుపల్లిరూరల్: సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు


ముదిగొండ: మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సత్తుపల్లిరూరల్: ఏళ్ల మాదిగల పోరాట ఫలితంగా ఎస్సీ ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధించుకునే చివరి దశలో ఉన్నామని, మాదిగలందరు ఐక్యతగా ఉండాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం సత్తుపల్లిలో ఎమ్మార్పీఎస్ మండల సమావేశం స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో మండల ఇన్‌చార్జ్ గొల్లమండల ముత్తారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ జులై 7న మాదిగల ఆత్మగౌరవ కవాత్ వరంగల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కవాత్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు తడికమళ్ల దాస్ మాదిగ, పరిగడుపు లక్ష్మణ్, గద్దల దేవన్న, ఆరెంపుల నర్సింహారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కవాతుకు సిద్ధం కావాలి.

ముదిగొండ: మాదిగల ఆత్మగౌరవ కవాతుకు సిద్ధం కావాలని ఎంఎస్పీ నాయకులు నూకల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ముదిగొండలో ఎఆర్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం మండల నాయకులు పడిశాల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. జులై7న నిర్వహించనున్న కవాతుకు నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని, ప్రతీ గ్రామంలో ప్రచారం నిర్వహించాలన్నారు. నాయకులు కట్టకూరి సురేష్, యండ్రాతి నాగరాజు, ఇరుకు రమేష్, కిరణ్, నాగేంద్రబాబు, లక్ష్మణ్, రవీంద్ర బాబు, రాంబాబు, అనిల్ పాల్గొన్నారు.

సమస్యల బడిలో..

ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉపాధ్యాయ పోస్టులు

- కనీస వసతులు సైతం కరువు
- పిల్లల్ని చేర్పించేందుకు తల్లిదండ్రుల విముఖత



పెద్దబీరువల్లిలో అసంపూర్తిగా గదుల నిర్మాణం (ఇన్‌సెట్) చెత్తాచెదారంతో నిండిన మరుగుదొడ్డి

బోనకల్: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఉన్నత పాఠశాలలో భారీగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. అసలే ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో సరైన అభిప్రాయం లేకపోవడంతో ప్రయివేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. రోజురోజుకు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. పాఠశాలలో విద్యాకమిటీలు వేసి బడిబాట కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ సత్ఫలితాలను ఇవ్వడం లేదు.

భారీగా ఖాళీలు..

మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, 1 ప్రాథమికోన్నత 10 ఉన్నత పాఠశాలలు మొత్తం 43 పాఠశాలలు ఉన్నాయి. ప్రాతమిక పాఠశాలలో 93 ఉపాధ్యాయ పోస్టులకు గాను 73 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఉన్నత పాఠశాలలకు సంబంధించి 112 మంది పోస్టులకు గాను 71 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తుండగా 61 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గోవిందాపురం(ఎల్) పాఠశాలలో 12 మందికి గాను ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండడంతో విద్యార్థులకు విద్యాబోధన జరగడం లేదు. దీంతో పాటు రావినూతలలో కూడా 15 పోస్టులకు గాను 10 మంది పనిచేస్తున్నారు. జానకీపురం పాఠశాలలో 15 పోస్టులకు గాను 8 మంది ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. ఇలా అన్ని పాఠశాలలో తక్కువ మంది ఉపాధ్యాయులతో విద్యాబోధన జరగుతుండడంతో తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పిస్తున్నారు. ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల ప్రభావం పదోతరగతి విద్యార్థులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, దీనికి పరిష్కారం ఉపాధ్యాయులకు పదోన్నతలు కల్పించి ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని, లేదా పదోన్నతులు ఆలస్యమైతే విద్యా వలంటీర్లను నియమించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సౌకర్యాలు అంతంతమాత్రమే..

అదేవిధంగా పలు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గదులు సరిపోవడం లేదు. అదనపు గదులు కొన్ని చోట్ల అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో తాగునీరు వసతి సక్రమంగా లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి వసతులు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.

త్వరలోనే పోస్టుల భర్తీ



త్వరలోనే ఉపాధ్యాయ పదోన్నతులు జరుగడంతో ఖాళీ పోస్టుల భర్తీకి అవకాశముంటుంది. మన ఊరు–మన బడి ప్రణాళిక ద్వారా పాఠశాలలో మౌలిక వసతుల కల్పన జరుగుతుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు బడిమాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– కొత్తపల్లి వెంకటేశ్వరావు, ఇన్‌చార్జ్ ఎంఈఓ

రోడ్డు ఆక్రమణపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు


వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొణిజర్ల: మండలంలోని లక్ష్మీపురంలో రైతులు ఉమ్మడిగా వేసుకున్న రోడ్డును ఓ పారిశ్రామిక వేత్త ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేసుకున్నారని, సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం లక్ష్మీపురం రైతులు వైరా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్డును ఆక్రమించుకుని ఫెన్సింగ్ వేస్తున్నారని దీని వల్ల సుమారు 40 మంది రైతులు తమ పొలాలకు వెళ్లేందుకు దారి లేదని , మరో వైపు ఎన్ఎస్పీ కాల్వ కరకట్టను ఆక్రమించుకుని రోడ్డు నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేయాలని ఎమ్మెల్యే రాందాస్ నాయక్ వైరా సీఐ సాగర్ నాయక్‌ను, ఎన్ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఈమేరకు వైరా సీఐ సాగర్ , కొణిజర్ల ఎస్సై శంకరరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. సోమవారం సెలవు దినం కావడంతో ఎన్ఎస్పీ అధికారులు ఎవరూ రాలేదని రైతులు తెలిపారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కోపూరి పూర్ణయ్య

చింతకాని: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోపూరి పూర్ణయ్య తెలిపారు. మండల కేంద్రంలోని రైతువేదికలో లబ్ధిదారులకు సోమవారం కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఉచితంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు వంటి పథకాలను అమలు చేస్తుందన్నారు. ఈ మేరకు మండలంలో 32 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, తహసీల్దార్ రమేష్, ఆర్ఐ ఉష, తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాలు, పలకలు పంపిణీ



నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న వీరమోహన్‌రెడ్డి

తల్లాడ: కారుణ్య సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో 320 మంది పేద విద్యార్థులకు తల్లాడ సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి నోట్ పుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అదేవిధంగా మండలంలోని అన్నారుగూడెం, గోపాలపేట, జగన్నాథపురం , మంగాపురం, నూతనకల్, నారాయణపురం గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరమోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యతోనే ఉజ్వల భవిషత్ ఉంటుందన్నారు. సర్వీస్ సొసైటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో కారుణ్య సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు గొడుగునూరి ఝాన్సీ, కార్యదర్శి గొడుగునూరి బాలరెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, దాసరి పద్మస్మారకు యువజన సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షుడు గుమ్మా నరేష్, వేమిరెడ్డి చలపతిరెడ్డి, గొడుగునూరి తిరపతమ్మ, కృష్ణమ్మ, నరసింహారావు, డి.అంకంరాజు, దార సంతోష్, తిగుళ్ల నరసింహారావు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.